



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM
www.suryaa.com




# ఎమ్మెల్యే పదవికి ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా

గుంటూరు జిల్లా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీకి షాకిచ్చారు. ఎమ్మెల్యే పదవితో పాటుగా పార్టీకి రాజీనామా చేశారు.. స్పీకర్‌కు తన రాజీనామా లేఖను పంపారు. అలాగే పార్టీకి రాజీనామా చేసిన లేఖను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపారు. స్పీకర్‌కు పంపిన లేఖలో ఎలాంటి కారణాలను ప్రస్తావించలేదు.. కేవలం పదవికి రాజీనామా చేసినట్లు మాత్రమే చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో కొంత కాలంగా వైఎస్సార్‌సీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు తెలుస్తోంది. కొంత కాలంగా ఈ వర్గపోరు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల పోటాపోటీగా కార్యాలయాలు సైతం ప్రారంభించారు. అయితే నియోజకవర్గంలో మొత్తం రెండు, మూడు గ్రూపులు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. టీడీపీ నుంచి వచ్చి గంజి చిరంజీవి టికెట్ ఆశిస్తున్నారు.. అలాగే కాండ్రు కమల, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్లు కూడా తెరపైకి వచ్చాయి.




# ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు


## 2024 సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశం



జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను ఉపసంహరిస్తూ 2019వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దీనిపై సుదీర్ఘ విచారణ చేపట్టింది. దీనిపై సోమవారం వెలువరించిన తీర్పులో ఆర్టికల్ 370ని రద్దు చేయడం అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో తీసుకున్న నిర్ణయం అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అలాగే పార్లమెంట్ నిర్ణయాన్ని కొట్టిపారేయలేం అని కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల బెంచ్ తీర్పు నిచ్చింది. కేంద్ర నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 యుద్ధ నేపథ్యంలో కుదుర్చుకున్న తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని పేర్కొంది.జమ్మూ కశ్మీర్ కు సార్వభౌమాధికారం లేదని,భారత రాజ్యాంగమే ఫైనల్ అని స్పష్టం చేసింది. జమ్ము కశ్మీర్ రాజు నాడు దీనిపై ఒప్పందం చేసుకున్నారని సుప్రీం కోర్టు వివరించింది. ఆర్టికల్ 370 జమ్ముకశ్మీర్లో యుద్ధవాతావరణాన్ని సృష్టించిందని, కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సవాల్ చేయడం సరికాదని పేర్కొంది. అలాగే రాష్ట్రపతి అధికారాలను ప్రతిసారి న్యాయపరిశీలనకు తీసుకోవడం సాధ్యంకాదని సీజేఐ స్పష్టం చేశారు.

### వచ్చే ఏడాది ఎన్నికలు నిర్వహించండి


జమ్మూకశ్మీర్ నుంచి లద్దాఖ్‌ను పూర్తిగా విభజించి, దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగుతున్న జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదాను త్వరగా పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌లో 2024 సెప్టెంబరు 30వ తేదీలోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.. ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి సెప్టెంబర్ వరకు దీనిపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. సెప్టెంబరు 5న రిజర్వులో ఉంచిన తీర్పును సోమవారం వెలువరించింది. కాగా 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. అయితే దీనిని స్థానిక రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆయా పార్టీలు సుప్రీం కోర్టులో పిటిషన్లను దాఖలు చేశాయి. కీలక తీర్పు వెలువడిన నేపథ్యంలో కశ్మీర్‌లో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. రెండు వారాలుగా కశ్మీర్ లోయలోని 10 జిల్లాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొందరు నాయకులను అదుపులోకి తీసుకోగా మరి కొందరిని గృహనిర్బంధంలో ఉంచారు. ప్రజలను రెచ్చగొట్టేవారిపై చర్యలు తప్పవని స్థానిక పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు.




# లోకేశ్ 'యువగళం' పైలాన్ ఆవిష్కరణ.. హాజరైన బ్రాహ్మణి, మోక్షజ్ఞ

'యువగళం' పాదయాత్ర 3వేల కి.మీ మైలురాయిని పూర్తిచేసుకున్న సందర్భంగా తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పైలాన్‌ను ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం రాజుల కొత్తూరు వద్ద పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ చిన్నల్లుడు శ్రీభరత్, బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ హాజరయ్యారు. పెద్ద ఎత్తున తెదేపా నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన 'యువగళం' పాదయాత్రకు.. ప్రభుత్వం, వైకాపా నాయకుల నుంచి అవరోధాలు ఎదురైనా లోకేశ్ ప్రజాగళం వినిపిస్తూ ముందుకు సాగారు. పది ఉమ్మడి జిల్లాల్లో 92 నియోజకవర్గాల మీదుగా సాగిన యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మలికిపురం మండలం దిండి వద్ద సెప్టెంబరు 8న యాత్ర ప్రవేశించింది. మర్నాడు చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పాదయాత్ర 79 రోజులపాటు ఆగింది. గత నెల 26న యాత్ర పునఃప్రారంభించారు. అన్నివర్గాలూ పాదయాత్రకు నీరాజనం పలికాయి.





# సినిమా నిర్మాణంలోకి సమంత!

మీడియా ద్వారా ప్రకటించింది. 'బ్రౌన్ గర్ల్ ఈజ్ ఇన్ ది రింగ్ నౌ' అనే పాట స్ఫూర్తితో ట్రాలాలా అని తన నిర్మాణ సంస్థకు పేరు పెట్టానని సమంత స్పష్టం చేసింది. వాస్తవికతతో కూడిన అర్థవంతమైన కథలు చెప్పగలిగే ప్రతిభావంతులైన కొత్త దర్శకులను తన నిర్మాణ సంస్థ ద్వారా ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నాను అని సమంత తన పోస్ట్ లో తెలిపింది. ఇక సమంత చివరిసారిగా విజయ్ దేవరకొండ సరసన పాన్ ఇండియన్ ఫిల్మ్ ఖుషిలో నటించింది. ప్రస్తుతం సమంత సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. అన్నట్టు తన ప్రొడక్షన్ హౌస్ నుంచి థియేటర్ల కోసమే కాకుండా OTT ప్లాట్‌ఫారమ్‌ల కోసం కూడా ప్రత్యేకమైన కంటెంట్‌ను కూడా సమంత ప్లాన్ చేస్తోందట. ప్రస్తుతానికి నటిగా ఓ అమెరికన్ రీమేక్ సిరీస్ లో సమంత నటిస్తోంది.

# కశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం



జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తూ వచ్చిన రాజ్యాంగంలోని 370 అధికరణం రద్దు అంశంపై సోమవారం సుప్రీం కోర్టు కీలక తీర్పును వెలువరించనుంది. ఈ నేపథ్యంలో కశ్మీర్‌లో అధికార యంత్రాంగం భద్రతను కట్టుదిట్టం చేసింది. కొందరు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని గృహనిర్బంధంలో ఉంచారు. రెండు వారాలుగా కశ్మీర్ లోయలోని 10 జిల్లాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు సమీక్షలు నిర్వహించారు.

# ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేస్తాం..

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్ర ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం త్వరలో విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గం ప్రజల ఆశీస్సులతో ఉన్నతి పదవి చేపట్టానని తెలిపారు. మధిరప్రజలందరి కృతజ్ఞతలు అన్నారు. ఈ నెల 14 నుండి అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని అన్నారు. చారిత్రాత్మక విజయం తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. నిధులు, నియామకాలు, ఆత్మ గౌరవం కోసం తెలంగాణ సమాజం కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నారని తెలిపారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనా అంత అస్తవ్యస్తం అన్నారు. రాష్ట్ర సంపద అంతా దోపిడీ గురైందన్నారు. పూర్తిగా 10 ఏళ్లల్లో రాష్ట్రం 70 ఏళ్ళు అభివృద్ధిలో వెనకబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయంలో ఫీడల్ వ్యవస్థ ఏర్పడిందన్నారు. ప్రభుత్వంలో ఉన్నా ప్రతి వ్యవస్థ ప్రజలకోసంమే పనిచేసేలా పాలనా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. భారత రాజ్యంగా స్ఫూర్తితో పాలనా అందిస్తామని తెలిపారు. కుట్రపూరితమైన పాలనకు చరమగీత పాడారని హర్షం వ్యక్తం చేశారు. మండల, జిల్లా స్థాయిలో ప్రజా దర్బార్ లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం త్వరలో విడుదల చేస్తామని అన్నారు. ఇక కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. అంతేకాకుండా.. ఆరు గ్యారంటీల్లో 2 గ్యారంటీలను 2 రోజుల్లోనే ప్రారంభించామన్నారు. రాష్ట్ర వనరులు సంపద సృష్టికి ఉపయోగపడతాయన్నారు. సృష్టించిన సంపదను ప్రజలకు పంచడమే కాంగ్రెస్ ఎజెండా అని తెలిపారు. పరిశ్రమలు, ఐటీ, సేవా రంగాలను ప్రోత్సహిస్తామన్నారని తెలిపారు. తొలి వంద రోజుల్లో ఆరు హామీలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో మరిన్ని హామీలను పొందుప [redacted] హామీలకు ఎలాంటి [redacted] ర్శించింది. వారంటీ [redacted] తగిలేలా ప్రజలు చే [redacted]



# శబరిమలలో దర్శన సమయం గంట పెంపు

## ఇకపై మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 వరకు..

రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీబీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శబరిమల అయ్యప్ప దర్శన సమయాన్ని గంటసేపు పొడిగించింది. ప్రస్తుతం రోజులో రెండో భాగంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులు అయ్యప్పను దర్శనం చేసుకుంటున్నారు. ఇకపై మధ్యాహ్నం మూడు గంటల నుంచే దర్శనాలు మొదలై రాత్రి 11 గంటల వరకు కొనసాగనున్నాయి.

# సీఎం రేవంత్ ను కలిసిన జానారెడ్డి



కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కలిసారు. సీఎం అయ్యాక రేవంత్ ను తొలిసారి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు జానారెడ్డి. రేవంత్ ను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రేవంత్ ను శాలువా కప్పి సన్మానించారు . జానారెడ్డి ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో జానారెడ్డి పోటీ చేయలేదు. ఆయన కుమారుడు జై వీర్ రెడ్డి నాగార్జున సాగర్ నుంచి పోటీ చేసి గెలిచారు. సీఎం రేవంత్ జానారెడ్డిని కలవడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేబినెట్ లో ఇప్పటి వరకు 11 మంది మంత్రి పదవులు ఇచ్చారు. ఇంకా ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. అంతేగాకుండా కీలక హోంశాఖ ఇంకా ఎవరికి కేటాయించలేదు. సీఎం వద్దే ఉంది. జానారెడ్డి కాంగ్రెస్ లో సీనియర్ నేత కావడంతో .. ఆయనకు హోంశాఖను ఇస్తారా.? సీఎం రేవంత్ అందుకే కలిశారా అని.. పొలిటికల్ సర్కిల్ లో డిస్కస్ చేసుకుంటున్నారు.

# త్వరలో వా[redacted]లో బస్సు టిక్కెట్లు

దేశ రాజధాని ఢిల్లీలోని సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. త్వరలో ఢిల్లీ వాసులు వాట్సాప్‌లో బస్సు టిక్కెట్లను పొందనున్నారు. వాట్సాప్ ఆధారిత బస్ టికెటింగ్ విధానాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నట్టు అధికారులు తెలిపారు. కాగా ఈ విధానాన్ని ఇప్పటికే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రారంభించింది.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# చలితో చంటి పిల్లల్లో న్యూమోనియా

## నిలోఫర్‌లో 50 మంది వరకు చేరిక

చలి గాలులు, చల్లని వాతావరణంతో చంటి పిల్లల్లో శ్వాసకోశ వ్యాధుల తోపాటు ఆస్తమా, న్యుమోనియా కేసులు నమోదవుతున్నాయి. పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో ఇప్పటికే 50 మంది వరకు చేరారు. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో చికిత్స కోసం ఎక్కువ మంది వస్తున్నారు. కొందరికి 5-6 రోజుల నుంచి జ్వరం తగ్గక పోవడం, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే న్యుమోనియా కింద గుర్తించి ఆసుపత్రిలో చేర్చుకొంటున్నారు. బరువు తక్కువ, నెలల నిండకుండా పుట్టిన పిల్లల్లో ఈ సీజన్‌లో హైపోథెర్మియా(ఒళ్లు చల్లబడిపోవడం) సమస్య కన్పిస్తుంది. న్యుమోనియా లక్షణాలు కనిపించగానే సొంతంగా యాంటిబయోటిక్స్ వాడవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

### కంగారూ మదర్ కేర్ పిల్లలకు కీలకం..

ఈ సీజన్‌లో చంటి పిల్లలు ఎక్కువగా న్యుమోనియా బారిన పడుతుంటారు. వారి చుట్టూ వెచ్చని వాతావరణం ఉండేలా చూడండి. తలుపులు, కిటికీలు తెరిచిపెట్టడం, బయట వాతావరణంలో తిప్పడం వల్ల న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంది. దీంతో జ్వరం, దగ్గు, డొక్కలు ఎగరేయడం, ఎక్కువసార్లు ఊపిరి తీసుకుంటారు. ముఖ్యంగా చంటి పిల్లలను చల్లని వాతావరణం నుంచి కాపాడాలంటే కంగారూ మదర్ కేర్ కీలకం. అంటే కంగారు జంతువు తన పిల్లలను కడుపులోని సంచిలో పెట్టుకున్నట్లుగా తల్లి కూడా తన బిడ్డను ఛాతీపై పడుకోబెట్టుకొని ఉంచడం వల్ల తల్లి శరీర ఉష్ణోగ్రతలు చిన్నారిని కాపాడతాయి. తల్లిపాలు కూడా సక్రమంగా అందుతాయి. దీంతో బిడ్డ బరువు పెరిగి ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఉంటారు. సాధ్యమైనంత ఎక్కువ సమయం కంగారూ మదర్‌కేర్‌లో ఉంచాలి.



# బస్సుల్లో 15% పెరిగిన రద్దీ!

మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరుగుతోంది. గత ఆదివారం(3వ తేదీ)తో పోలిస్తే ఈ ఆదివారం(10వ తేదీ) దాదాపు 15 శాతం పెరిగినట్లు ఆర్టీసీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని చెబుతున్నారు. టిమ్స్‌లో 'జీరో టికెట్' సాఫ్ట్‌వేర్ వచ్చాక వాస్తవ సంఖ్యపై స్పష్టత వస్తుందని ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సాధారణంగా మిగతా రోజులతో పోలిస్తే సోమవారం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందులోనూ ఈ నెల 11 కార్తికమాసంలో ఆఖరి సోమవారం కావడంతో మహిళా ప్రయాణికుల రద్దీ భారీగా ఉండవచ్చని ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో డ్రైవర్లు, కండక్టర్లకు సెలవులను రద్దు చేసింది.

**శైవ క్షేత్రాలకు అధిక బస్సులు**

వేములవాడ, కీసరగుట్ట, రామప్ప, కాళేశ్వరం వంటి శైవ క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో బస్సులు నడిపించాలని ఆర్టీసీ నిర్ణయించింది. మిగతా రూట్లకు తగ్గించి.. శైవ క్షేత్రాలకు రద్దీకి తగ్గట్లు నడపాలని ఉన్నతాధికారులు ఆదివారం ఆదేశించారు. సాధారణ రోజుల్లో 31-32 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు నడుస్తాయి. సోమవారం ఆ సంఖ్య 34 లక్షల కిలోమీటర్లకు పెరుగుతుంది. ఈ నెల 11న(సోమవారం) మరో 10 శాతానికిపైగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. స్పేర్ బస్సులను కూడా సిద్ధం చేస్తోంది. 'మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు ప్రయత్నిస్తాం. ఉన్న బస్సులతోనే ప్రయాణికుల అవసరాలు తీర్చేందుకు సరికొత్త వ్యూహాలపై దృష్టి పెడతాం. దూర ప్రాంతాల వరకు కాకుండా ఎక్కడి వరకు రద్దీ ఉంటే.. అక్కడివరకే నడిపేలా 'కట్ ట్రిప్పు'లు వంటివి ఇందులో ఉంటాయి. అనుభవాన్ని బట్టి కొత్త ఆలోచనలకు అనుగుణంగా కార్యాచరణ పెడతాం' అని ఆర్టీసీ ఉన్నతాధికారి వివరించారు.

# బోల్డ్ సీన్స్ పై త్రిప్తి దిమ్రి కామెంట్స్ వైరల్

సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించిన 'తృప్తి డిమ్రీ' హాట్ టాపిక్‌గా మారింది. దీంతో సినిమా చూసిన వారంతా ఈ బ్యూటీ పై కామెంట్స్ చేస్తున్నారు. దాంతో తృప్తి డిమ్రీ సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది కూడా. ఐతే, యానిమల్ మూవీలో రణ్‌బీర్ కపూర్‌తో తన రొమాంటిక్ సీన్ చూసి తన పేరెంట్స్ ఆశ్చర్యపోవడంతో పాటు కాస్త ఫీలయ్యారని త్రిప్తి దిమ్రి వెల్లడించారు. 'ఇలాంటివి మేం సినిమాల్లో చూడలేము. నువ్వు ఇలా చేయకూడదు. కానీ ఫర్వాలేదు' అని వారు చెప్పారని ఆమె తెలిపారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఒక నటిగా తన పనిని పూర్తి చేశానని చెప్పడంతో వారు అర్థం చేసుకున్నారని త్రిప్తి పేర్కొన్నారు. మొత్తానికి తృప్తి డిమ్రీ బరువైన భావోద్వేగ సన్నివేశాల్లో కూడా సెటిల్డ్ గా నటించే ప్రయత్నం చేసింది. అలాగే, కొన్ని బోల్డ్ సీన్స్ లో కూడా ఆమె తన గ్లామర్ తో సినిమాకి ప్లస్ అయ్యింది. మొత్తానికి హై వోల్టేజ్ ఇంటెన్సివ్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం భారీ కలెక్షన్స్ ను రాబడుతుంది. రణబీర్ కపూర్ నటన, భారీ వైల్డ్ యాక్షన్ సీన్స్, బోల్డ్ ఎలిమెంట్స్ కారణంగా ఈ సినిమా మొత్తానికి హిట్ ను సాధించింది.





# ఆస్పత్రి నంచి కెప్టెన్ విజయ్‌కాంత్ డిశ్చార్జ్!

ప్రముఖ తమిళ నటుడు, డీఎండీకే వ్యవస్థాపకుడు, కెప్టెన్ విజయ్‌కాంత్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. చెన్నైలోని మియాట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. పూర్తిగా కోలుకోవడంతో సోమవారం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. 71 ఏళ్ల విజయ్‌కాంత్ అనారోగ్య కారణాల వల్ల నవంబర్ 18న ఆసుపత్రిలో చేరారు. 23 రోజుల తర్వాత కోలుకున్న కెప్టెన్.. నేడు చెన్నైలోని తన నివాసానికి వెళ్లిపోయారు. విషయం తెలిసిన విజయ్‌కాంత్ ఫాన్స్, డీఎండీకే కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది రావడంతో విజయకాంత్‌ను ఆయన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. డయాబెటిస్ కారణంగా గతంలో కెప్టెన్ కుడికాలి మూడు వేళ్లని తొలగించారు. గతకొంతకాలంగా 71 ఏళ్ల విజయ్‌కాంత్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అనారోగ్యంతో కొద్దిరోజులుగా అయాన పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండడంతో.. కెప్టెన్ భార్య ప్రేమలత ముందుండి పార్టీ వ్యవహారాలను చక్కబెడుతున్నారు. 2020 సెప్టెంబర్ నెలలో విజయకాంత్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. 10 రోజుల చికిత్స తర్వాత ఆయన మహమ్మారి నుంచి కోలుకున్నారు. రెండేళ్ల క్రితం విజయకాంత్ సింగపూరులో చికిత్స చేయించుకున్నా పూర్తిగా కోలుకోలేదు. విజయకాంత్ ఆరోగ్యం గురించి ఆయన సతీమణి ప్రేమలత ఎప్పటికప్పుడు అభిమానులకు సమాచారం ఇస్తున్నారు.

# ఫైళ్లు మాయంపై దర్యాప్తు జరగాల్సిందే..



కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

ప్రభుత్వ విభాగాల్లో ఫైళ్లు మాయం కావడంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి ఆఫీసుతో పాటు ఇతర విభాగాల్లో కూడా ఫైళ్లు, ఇతర వస్తువులను తరలించే ప్రయత్నాన్ని ప్రజలందరూ చూశారని, స్థానికులు, పోలీసులు అప్రమత్తమవడంతో వదిలేసి వెళ్లిపోయారని వివరించారు. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు.

**ధీరజ్‌పై రాహుల్‌కు ఎందుకంత ప్రేమ?**


మూడు రోజులుగా కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంటిపై ఐటీ అధికారుల దాడులు నిర్వహిస్తున్న తీరు దేశం మొత్తం విస్తుపోయేలా చేసిందని, నగదు దొరకడం చరిత్రలోనే మొదటిసారి అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధీరజ్ సాహు ఆపార్టీ నేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడని, చిన్న చిన్న విషయాలకు స్పందిస్తూ ట్విట్టర్ లో పోస్టులు పెట్టే రాహుల్ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో మూడు సార్లు ఓడిపోయినా కూడా ధీరజ్ సాహును మూడు సార్లు రాజ్యసభ ఎన్నుకున్నారని, ధీరజ్‌పై ఎందుకంత ప్రేమ చూపిస్తున్నారో రాహుల్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి చేసే ముఖ్యమంత్రులను, ఎంపీలను ఏటీఎంలుగా మార్చుకుందని, ఆ పార్టీ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# నాడు నల్లడబ్బుపై ట్వీట్ చేసి.. నేడు నోట్లగుట్టలతో చిక్కి..!





ఒడిశా ప్రధాన కేంద్రంగా కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు కుటుంబం నిర్వహిస్తున్న డిస్టిలరీ కంపెనీపై ఆదాయపు పన్ను విభాగం అధికారులు నిర్వహించిన దాడుల్లో రూ.వందల కోట్లు బయటపడ్డాయి. ఐదు రోజులుగా 50 మంది బ్యాంకు అధికారులు 40 కౌంటింగ్ మెషిన్లతో ఆ నోట్ల గుట్టలను లెక్కించగా.. ఇప్పటివరకు రూ.353 కోట్ల లెక్క తేలిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఓ దర్యాప్తు సంస్థ చేపట్టిన సోదాల్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం దేశంలో ఇదే తొలిసారి. దీనిపై భాజపా తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో పార్లమెంట్ బయట పార్టీ ఎంపీలు నిరసన చేపట్టారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. జేపీ నడ్డా మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, కరప్షన్ ఒకే నాణానికి రెండు ముఖాలు లాంటివి. ధీరజ్ సాహు వద్ద దొరికిన ఈ నల్లడబ్బు ఎవరిది..? దీనిపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమాధానం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. భారీ స్థాయిలో నగదు వెలుగులోకి రావడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక ఎంపీ ఇంటినుంచి ఈ స్థాయిలో నగదును స్వాధీనం చేసుకున్నారు. కానీ దీనిపై ప్రతిపక్షాల ఇండియా కూటమి మాత్రం మౌనం వహిస్తోంది. కరప్షన్ అనేది కాంగ్రెస్ స్వభావం కాబట్టి ఆ పార్టీ నిశ్శబ్దంగా ఉందంటే ఓకే. జేడీయూ, ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ ఎందుకు మౌనం వహిస్తున్నాయి' అని ఇండియా కూటమిపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఈ కౌంటింగ్ దాదాపుగా పూర్తికావొచ్చిందని ఐటీ శాఖ అధికారులు తెలిపారు. బాలంగిర్‌లోని ఎస్‌బీఐ శాఖలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయనున్నారు. 'మొత్తం 176 బ్యాగుల్లో 140కి పైగా బ్యాగుల్లోని నగదు కౌంటింగ్ పూర్తయింది. మిగిలిన నగదును ఈ రోజు లెక్కిస్తాం' అని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ తెలిపారు. ఇదిలా ఉంటే.. గతంలో అవినీతికి వ్యతిరేకంగా ధీరజ్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. 'డీమానిటైజేషన్ తర్వాత కూడా దేశంలో నల్లధనం, అవినీతిని చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. అంత నల్లడబ్బు ఎలా ఒకదగ్గర పోగుపడుతుందో నాకర్థం కావడం లేదు. ఈ దేశంలో అవినీతిని పారదోలేది కాంగ్రెస్ మాత్రమే' అని అప్పట్లో ఆయన ట్వీట్ చేశారు. ఈ కాంగ్రెస్ ఎంపీ పోస్టును భాజపా నేత అమిత్ మాలవీయ రీట్వీట్ చేశారు. 'ధీరజ్ ప్రసాద్ సాహుకు మంచి హాస్య చతురత ఉంది' అని ఎద్దేవా చేశారు.




# 'గుంటూరు కారం' నుంచి 'ఓ మై బేబీ'!

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గుంటూరు కారం' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాలోని 'ఓ మై బేబీ' పాట ప్రోమో ఈరోజు సాయంత్రం 4:05 గంటలకు విడుదల కానుంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలోని 2వ సింగిల్ పూర్తి పాట డిసెంబర్ 13న విడుదల కానుంది. మొత్తానికి సూపర్ స్టార్ అభిమానులందరికీ ఇది ఖచ్చితంగా సంతోషకరమైన వార్త. ఇక ఈ చిత్రం సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 12, 2024న రిలీజ్ కానుంది. గుంటూరు మిర్చి యాడ్ నేపథ్యంలో ఈ సినిమా నడుస్తోంది. ముఖ్యంగా మహేష్ బాబు బాడీ లాంగ్వేజ్ కి సరిపడే సరికొత్త స్టోరీతో త్రివిక్రమ్ ఈ సినిమా కథని ప్లాన్ చేశాడట. హారిక & హాసిని క్రియేషన్స్ భారీ ఎత్తున ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా మహేష్ కెరీర్లో 28వ సినిమాగా తెరకెక్కుతుంది.